క్లుప్తంగా

ఏపీఎస్పీ విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది శుక్రవారం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు ప్రారంభించారు. శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు రాజేష్, రమ్య, సిబ్బంది కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మన్మథరావు, శేఖరరావు, మోహన్‌రావు, ఆర్ఐలు మురళీమోహనరావు, అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు గరికిపాటి ప్రవచనం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళామందిరంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు కాదంబరి కావ్యంపై పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ప్రవచనం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాణి సుబ్బయ్య దీక్షిత సాహితీ కౌముది ఆధ్వర్యంలో ఈ ప్రవచనం సాగుతుందన్నారు. సాహితీ ప్రియులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొలని కోరారు.

రేపు ఆరుద్ర శత జయంతి సభ

బోట్‌క్లబ్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక గాంధీభవన్‌లో ఆరుద్ర శత జయంతి సభ జరుగుతుందని సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుద్ర జీవితం-సాహిత్యం అంశంపై ఈ సభ జరుగుతుందన్నారు. సాహిత్య ప్రియులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

శిశు గృహ కొత్త భవనం ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ ప్రతాప్ నగర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథ బాలల వసతి కోసం నిర్దేశించిన శిశు గృహ నూతన భవనం శుక్రవారం ప్రారంభమైంది. కాకినాడ అశోక్ నగర్‌లోని పాత భవనాన్ని అధికారులు ఖాళీ చేసి నూతన భవంతిలోకి వెళ్లారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన




నడకుదురు హైస్కూలులో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

కరప: ఎంఈఓ-1 పోస్టులన్నింటినీ ఉమ్మడి డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు కేటాయిస్తూ, పదోన్నతి కల్పించాలని కోరుతూ పీఆర్టీయూ, ఏపీయూఎస్ ఉపాధ్యాయుల రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నడకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉమ్మడి డీఎస్సీలో ఎంపికై వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎంఈఓ-1గా పదోన్నతి కల్పించాలన్నారు. పీఆర్టీయూ డిస్ట్రిక్ట్ సీపీఎస్ కన్వీనర్ వాకాడ వెంకటరమణ, ఏపీయూఎస్ మండల నాయకులు రాపర్తి గోపి, మురళి, భ్రమరాంబ, రమాదేవి, శ్రీలత, రాజసింహవర్మ, పి.ధనలీల తదితరులు పాల్గొన్నారు.

275 మందికి కొత్త పింఛన్లు

కాకినాడ రూరల్: మండలంలో కొత్తగా మంజూరైన 275 పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. లబ్ధిదారు చనిపోతే వారి పింఛన్లు స్పౌజ్ కోటా పేరిట ఇస్తుండడంతో కూటమి నేతలు గ్రామాల్లో హడావుడి చేశారు. పండూరులో ఎమ్మెల్యే పంతం నానాజీ పంపిణీ చేయగా పలు గ్రామాలలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పంపిణీలో పాల్గొన్నారు. సూర్యారావుపేటలో పింఛన్ల పంపిణీకి ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌ను పిలవలేదని ఆమె భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు సూరాడ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రెగ్యులర్ పింఛన్లు 18,282 ఉండగా తొలిరోజే 92 శాతం అందించామని ఎంపీడీఓ సతీష్ తెలిపారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



మరిడమ్మ తల్లి

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదాత సేవకు దూరంగా..

- రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- రేషనలైజేషన్ పేరుతో కుదింపునకు కుట్ర
- ఇప్పటికే ఆర్బీకేలో అందని సేవలు
- మూలకు చేరిన కియోస్క్‌లు



నిరుపయోగంగా మారిన రైతు భరోసా కేంద్రాలు



రైతు భరోసా కేంద్రాల్లో మూలకు చేరిన కియోస్క్

కాకినాడ సిటీ: రైతు భరోసా కేంద్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. అన్నదాతలకు ఎన్నో విధాల సేవలందించిన ఈ కేంద్రాలను కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా పక్కన పెట్టింది. ఈ కేంద్రాలను రైతు సేవల కేంద్రాలుగా పేరు మార్చినా ప్రయోజనం శూన్యం.

కూటమి ప్రభుత్వంలో..

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. రాయితీ విత్తనాలు ఇవ్వడం మానేసింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందిస్తోంది. అది కూడా రైతు సేవా కేంద్రాల నుంచి కాకుండా అధిక శాతం సింగిల్ విండోల ద్వారా విక్రయిస్తున్నారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలుండే గ్రామాల్లో మాత్రమే కేంద్రాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గాల్లో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి. దీనివల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురవుతుంది.

ఆర్బీకేల్లో కనుమరుగవుతున్న సేవలు

రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్) యంత్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇళ్ల వద్దకే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేదని, ఇప్పుడు ఆ సేవలన్నీ మరుగున పడిపోయాయని రైతులు బహిరంగంగా చెబుతున్నారు. తమకు కావల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే విధానం కూడా ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో కనిపించడం లేదని, తమకు కావల్సిన ఎరువులు విత్తనాలు, పురుగు మందుల వివరాలను రిజిస్టర్ చేసుకుని, ఆన్‌లైన్ పేమెంట్ పూర్తి చెల్లిస్తే 48 గంటల నుంచి 72 గంటల్లోగా తాము ఆర్డర్ చేసుకున్న వస్తువులు వస్తున్నట్లు తమకు ఫోన్‌లకు మెసేజ్ వచ్చేదని, తాము ఆర్బీకేలకు వెళ్లి వాటిని తీసుకునేవారమని రైతులు అంటున్నారు. ఇప్పుడు ఆ సేవలన్నీ కనుమరుగయ్యాయన్నారు. అధికారులు రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా యూరియా, ఇతర ఎరువులు అందిస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితిలేదని రైతులు వాపోతున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని దాదాపు 37 గ్రామాల్లో కియోస్క్ యంత్రాలు మూలకు చేరడంతో దాదాపు రైతుకు అందాల్సిన సేవలు నిలచిపోయాయని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చిందే కానీ వాటిలో కొత్తగా సేవలేవీ అందుబాటులోకి తీసుకురాకపోగా ఉన్న సేవలకు మంగళం పాడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని రైతులు విమర్శిస్తున్నారు.

రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలి

రైతు సేవా కేంద్రాల వల్ల మాకు ఎంతో ప్రయోజనం ఉంది. ప్రధానంగా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే పొందే అవకాశం ఉంటుంది. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– రావుల ప్రసాద్, కూరాడ, కరప మండలం

ఎరువులు అందుబాటులో ఉండేవి

గతంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎప్పుడూ ఎరువులు అందుబాటులో ఉండేవి. గ్రామాల్లో రైతులకు సేవలందిస్తున్న కేంద్రాలు మూతపడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– వి సీతారామరాఘవ, విజయరాయుడుపాలెం, కరప మండలం

ఘనంగా ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ డే



నడకుదురు హైస్కూలులో స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో హెచ్‌ఎం, బీఎస్‌జీ అసోసియేషన్ ప్రతినిధులు

కరప: మండలం నడకుదురులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీహెచ్‌కే విశ్వనాథం అధ్వర్యంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రవేశ్, ప్రథమ, ద్వితీయ సోపాన్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, కొత్తగా చేరిన విద్యార్థులకు బ్యాడ్జ్ అందజేశారు. అనంతరం విద్యార్థులకు 'సే నో డ్రగ్స్' అనే అంశంపై పోస్టర్ మేకింగ్ పోటీ నిర్వహించారు. డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ సంషాద్ బేగం, బీఎస్‌జీ అసోసియేషన్ కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణ, గైడ్స్ వింగ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎస్.లక్ష్మీకుమారి, యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి వాకాడ వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి ఐదు రోజుల జైలు, ఇద్దరికి రెండు రోజులు చొప్పున జైలు, ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో 10 మందిని హాజరుపరచగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అమ్మవారికి శ్రావణ శోభ



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మి అమ్మవారు



కరపలోని దుర్గాదేవి

- భక్తులతో ఆలయాలు కిటకిట
- తల్లి దర్శనాలకు బారులు
- భారీగా కుంకుమ పూజలు
- మొక్కులు చెల్లించుకున్న మహిళలు

బోట్‌క్లబ్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకూ భక్తులు బారులు తీరారు. అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సంతచెరువుమార్కెట్‌లోని కనకదుర్గ ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ ఆర్.రాజేశ్వరరావు ఏర్పాట్లు చేయగా భక్తులు భారీగా వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

కరపలో..

కరప: మండలంలోని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధర్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. మండలంలోని గ్రామాల్లో భక్తులు అమ్మవారి ఆలయాలను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రమణయ్యపేటలో సామూహిక వ్రతాలు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద సామూహిక వరలక్ష్మి వ్రతాలను గురువారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ మాజీ అధ్యక్షురాలు ఎంవీఎస్ఎల్ ప్రసూన గృహస్తులకు చీర, రవిక, పూజా సామగ్రి అందించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవిరెడ్డి, కార్యదర్శి శ్రీవాణి, కోశాధికారి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఎం, డిప్యూటీ సీఎంలకు భవన నిర్మాణ కార్మికుల పోస్టు కార్డు ఉద్యమం



పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టిన భవన నిర్మాణ కార్మికులు

కాకినాడ సిటీ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించినట్లు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా స్థానిక శారదాదేవి గుడి వద్ద నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను పవన్‌కల్యాణ్ వెంటనే అమలు చేయాలని, సంక్షేమబోర్డుకు రూ.కోటి ఇస్తానని హామీని తక్షణమే అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో కార్మికులు కె.శ్రీను, కె.రాము, సురేంద్ర, భాను, ప్రకాష్, సాగర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షల వార్షిక ప్యాకేజీతో జేఎన్‌టీయూకే విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాద్, అధ్యాపకులు

బాలాజీచెరువు (కాకినాడ): జేఎన్‌టీయూకే (యూపీఈకే) ప్లేస్‌మెంట్ డ్రైవ్ 2025-26లో యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జూలై 29న నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ బ్యాంకింగ్ టెక్నాలజీ కంపెనీ జీటా ద్వారా కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు నలుగురు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. సీఎస్ఈ విభాగం నుంచి పిచ్చిక హర్షవర్ధన్, వేలగ సీహెచ్ఎన్ఎస్‌వీఎల్.వైష్ణవి, చల్లా ప్రీతి, గుడ్డటి వెంకట శ్రీ సుమేధ ఎంపికయ్యారు. వీరికి రూ.18 లక్షల వార్షిక ప్యాకేజీగా నిర్ణయించారు. ప్రతి నెలకు రూ.60 వేలు స్టైఫండ్ ఇస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రావు, వీసీ ప్రసాద్ అభినందించారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం



తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: సుషేణ హెల్త్ ఫౌండేషన్ పర్యవేక్షణలో జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న మదర్ మిల్క్ బ్యాంక్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సీహెచ్ లక్ష్మి జీజీహెచ్, శిశుగృహలలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మిల్క్ బ్యాంక్ మేనేజర్ మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన, రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, కార్యదర్శి శివకుమార్, సీడీపీవో జ్యోతి, మాధవి, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి



రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జెండాను ఆవిష్కరిస్తున్న సతీష్

కాకినాడ సిటీ: రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌సిపిఐ) 92వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల జెండా ఆవిష్కరణలు నిర్వహించినట్టు రాష్ట్ర కార్యదర్శి ఆర్.సతీష్ తెలిపారు. శుక్రవారం ఆయన కాకినాడ పర్లోవపేటలో పార్టీ జెండా ఆవిష్కరించారు. 1934లో ఆగస్టు ఒకటో తేదీన పార్టీ ఏర్పడినప్పటి నుంచి 1947 వరకు పార్టీ సాయుధ పోరాటంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని గడగడలాడించిందన్నారు. కామ్రేడ్ బిష్ణుప్రసాద్‌రాబా ఆధ్వర్యంలో దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు మంగ, జీవన, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మ, రత్నం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చౌకబారు వ్యాఖ్యలు మానండి

కాకినాడ రూరల్: చౌకబారు వ్యాఖ్యలు మానుకుని హుందాగా వ్యవహరించాలని రాష్ట్ర హోం మంత్రి అనితకు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి హితవు పలికారు. బాధ్యత కలిగిన మంత్రి పదవిలో ఉన్నారనే విషయం విస్మరించి, సాధారణ కార్యకర్త మాదిరిగా మాట్లాడటం ఆక్షేపణీయమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై అనేక దాడులు, అకృత్యాలు జరుగుతున్నా పట్టించుకోకుండా.. కేవలం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను విమర్శించడమే అనిత పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఏడాదిగా వైఎస్సార్ సీపీ నేతలపై విమర్శలు చేయడం తప్ప మంత్రిగా ఆమె చేసిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో దిశా యాప్ ద్వారా మహిళలకు రక్షణ ఉండేదని, ఆ యాప్, ఆ చట్టంపై అవహేళనగా మాట్లాడిన కూటమి నేతలు ఇప్పుడు ఆ యాప్ అమలుకు ప్రయత్నించడంటే జగన్‌ను ఫాలో అవుతున్నట్టేనని అన్నారు. ఎన్‌సీఎల్‌టీ కేసు విషయంలో జగన్‌కు అనుకూలంగా తీర్పు వస్తే.. తల్లి, చెల్లిపై కేసు గెలిచారని సంతోషంగా ఉన్నారని అనిత మాట్లాడటం తగదన్నారు. రాజకీయాలతో సంబంధం లేని వైఎస్ భారతిపై కూడా అవాకులు, చవాకులు పేలడం సభ్యత అనిపించుకోదన్నారు. పేరుకే అనిత హోం మంత్రి అని, ఒక కానిస్టేబుల్‌ను బదిలీ చేసే స్థాయి కూడా ఆమెకు లేదని ఎద్దేవా చేశారు. కానిస్టేబుల్‌ను కొట్టిన మంత్రి సోదరుడిని వెంటనే అరెస్టు చేసి, తన సత్తా ఏమిటో నిరూపించుకోవాలని నాగమణి అన్నారు.

వర్గీకరణ.. రాజకీయ కుట్ర

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని మాల మహానాడు, డ్రాప్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను నమూనాగా పంజాబ్, హర్యానాలో మొట్టమొదట చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. కాంగ్రెస్ బీజం వేస్తే దేశం మొత్తం అమలు చేస్తున్నది ప్రధాని మోదీ అని ఆయన అన్నారు. వర్గీకరణ వల్ల వందలో నలుగురికే ప్రయోజనం కలుగుతోందని, నలుగురికి ఇచ్చే ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారని ఆయన ప్రశ్నించారు. ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైనా వెనక్కి తీసుకోవాల్సిందేనని అన్నారు. శాంతియుత పోరాటానికి సిద్ధం కండి అంటూ మాలలకు రత్నాకర్ పిలుపునిచ్చారు.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీల నిర్వహణకు నారాయణ విద్యాసంస్థల విరాళం



కలెక్టర్ షణ్మోహన్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు

కాకినాడ సిటీ: కాకినాడలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్ షిప్ టోర్నీల నిర్వహణకు కాకినాడ నారాయణ విద్యా సంస్థలు రూ.90 వేలు విరాళాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు అందజేశారు. ఈ మేరకు విద్యాసంస్థల డీజీఎం ఎస్‌డీవీ కృష్ణ, ఏజీఎం కె రాఘవేంద్రరావులు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఐఈవో ఐ శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ



దశపర్ణిక కషాయం తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న సిబ్బంది

పిఠాపురం: కోనసీమ, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాకు చెందిన పకృతి వ్యవసాయ శాఖ సిబ్బందికి శుక్రవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమానికి మూడు జిల్లాల నుంచి 40 మంది సభ్యులు హాజరయ్యారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వెంకటరమణ, కత్తిపూడిలో గాబు బాబ్జీ తదితరులు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం జి.రాగంపేటలో పాటి శ్రీనివాస్ శిక్షణ కేంద్రంలో దశపర్ణికషాయం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, చిల్లి స్పెషల్ కషాయాలు తయారు చేస్తూ వాటి ఉపయోగాలు, వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎంయూ కమ్యూనిటైజేషన్ జానకి, కాకినాడ డీపీఎం ఏలీయాజార్, గుండ్ర శివచక్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడాలి



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ రమేష్

- ఉపాధ్యాయులకు డీఈఓ రమేష్ పిలుపు
- సెప్టెంబర్ 30 నాటికి విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలని ఆదేశం

సామర్లకోట: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో ఎంఈఓల అధ్యక్షతన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రాథమిక స్థాయిలో అనేక మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చేరుతున్నారని, హైస్కూల్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారని తెలిపారు. దీని కారణంగా ప్రాథమిక స్థాయిలో బోధన సక్రమంగా ఉండటం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ స్థాయిలో ప్రతీ విద్యార్థి చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలన్నారు. ఎక్కాలపై విద్యార్థులు దృష్టి పెడితే గణితంపై శ్రద్ధ పెరుగుతుందని వివరించారు. ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు సెప్టెంబరు 30 నాటికి చదవడం, రాయడం అలవాటు కావాలని, లేకుంటే ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఇళ్లకు వెళ్లిన తరువాత తల్లిదండ్రులకు కూరగాయలు, పండ్ల పేర్లను ఆంగ్లంలో చెప్పడం ద్వారా తల్లిదండ్రులలో ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఎంఈఓ వై.శివరామకృష్ణ మాట్లాడుతూ డీఈఓ సూచనలను మండలంలో అమలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీబీ సెక్రటరీ వెంకటరావు, ఎంఈఓ 2 పి. పుల్లయ్య హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.